ది.18.6.2018 ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బి.వి.రాఘవులుగారితో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశం నోట్ ప్రచురణార్థం పంపుతున్నాము.

– జె.ప్రభాకర్

**మోడీ సూచన ప్రమాదకరం**

**సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు**

**హిందూత్వ రాజ్యానికి ప్రాతిపదికగా జమిలి ఎన్నికలు**

**ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్రం**

**మూడో ప్రత్యామ్నాయ ఆలోచన లేదు**

బిజెపి, ఆర్ఎస్ఎస్ పరివారం దేశంలో హిందూత్వ రాజ్యానికి ప్రాతిపదికగా జమిలి ఎన్నికలు తీసుకురావాలని చూస్తున్నాయని, దీనిలో భాగంగానే మోడీ నీతిఅయోగ్ సమావేశంలో జమిలి ఎన్నికల సూచన చేశారని, ప్రమాదకరమైన ఈ సూచనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు తెలిపారు. సోమవారం ఎంబివికెలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. దేశ వైరుధ్యాన్ని గమనించకుండా ప్రజాస్వామ్యాన్ని కాలరాసేందుకు హిందూత్వ పరివారం కుట్రలు పన్నుతోందని తెలిపారు. దేశంలో అనేక ప్రాంతాలు, భాషలు ఉన్నాయని అవన్నీ వైరుధ్యాలతో ఉంటే వాటిని గమనించకుండా ఏకపక్షంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని చూడటం సరైంది కాదని తెలిపారు. రాష్ట్రాల్లో ఎవరు పాలన చేయాలనేది ప్రజలు నిర్ణయించాలని, జమిలి ఎన్నికల పేరుతో ప్రజల నిర్ణయాలను కాలరాసే విధంగా కేంద్రం ముందుకెళుతోందని తెలిపారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధి పని నచ్చకపోతే వెనక్కు తీసుకునే హక్కు ఉండాలని ప్రపంచం మొత్తం ఆ వైపుగా చూస్తుంటే దేశంలో బిజెపి ప్రభుత్వం మాత్రం నియంతృత్వంగా ముందుకెళుతోందని తెలిపారు. ప్రజాస్వామ్య విధానాలను కాలరాసే ఇటువంటి పద్ధతులను సిపిఎం పూర్తిగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. గవర్నర్ల వ్యవస్థను కూడా దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఢిల్లీలో సమస్యలు పరిష్కరించాలని అక్కడ సిఎం కేజ్రీవాల్ ఆందోళన చేస్తున్నా లెఫ్టినెంట్ గవర్నర్ పట్టించుకోవడం లేదని తెలిపారు. బ్యూరోక్రాట్స్‌పై దాడిచేశారని చెప్పి అక్కడ పరిపాలన జరగకుండా చూస్తున్నారని, అక్కడ బ్యూరోక్రాట్లను కేంద్రం నియంత్రిస్తోందని పేర్కొన్నారు. లెఫ్టినెంగ్ గరవ్నర్ కూడా కేంద్రం చేతిలో బొమ్మలా మారి ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా గవర్నర్ స్పందించి ఢిల్లీలో సమస్యను పరిష్కరించాలని కోరారు. నీతి అయోగ్ మీటింగులో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధంగా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో పేర్కొన్న కొన్ని ప్రమాదకరమైన నిబంధనలు మారుస్తారని భావించామని, అయినా మార్చలేదని తెలిపారు. దీనివల్ల విద్యా, వైద్య రంగాల్లో రాష్ట్రాలు తీవ్రస్థాయిలో నష్టపోతాయని తెలిపారు. నీతి అయోగ్ కూడా ప్రధాని చేతిలో పావుగా మారిందని, దీనివల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలకు నష్టం వాటిల్లుతుందని, దీన్ని సిపిఎంగా తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. దీనిపై ఇప్పటికే కేరళ ఆర్థికమంత్రి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సమావేశం ఏర్పాటు చేశారని రాష్ట్రాల సమస్యలను, ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. మూడో ప్రత్యామ్నాయంపై తాము దృష్టి పెట్టలేదని తెలిపారు. ఎన్నికల ముందు ఫ్రంట్‌లు కట్టే ఆలోచన లేదని, అయిన తరువాత అప్పటి బలాబలాలను బట్టి విధానాల ప్రాతిపదికన ఫ్రంట్‌లు వస్తే ఆలోచిస్తామని తెలిపారు. ఈవిఎంలను తాము వ్యతిరేకించడం లేదని, అదే సమయంలో దానిలో ఉన్న లోపాలను సరిచేయాలని కోరుతున్నామన్నారు. దీంతోపాటు పేపర్ స్లిప్పు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పేపర్‌స్లిప్పు అంశం కూడా వివాదమైందని, దీనిపైనా విచారణ చేయాలని తాము కోరుతున్నామన్నారు. రాష్ట్రంలో హోదా గురించి తాము నాలుగేళ్లుగా అడుగుతుంటే పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు హోదా గురించి మాట్లాడుతూ తానే పోరాడుతున్నట్లు ఫోజులు పెట్టడం మాత్రం సమర్థనీయం కాదని అన్నారు. వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం, సిపిఐ ఉమ్మడిగా 20వ తేదీన విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి నాయకత్వం హాజరవుతుందని, భవిష్యత్ కార్యాచరణ కూడా నిర్ణయిస్తామని తెలిపారు.